క్రీడా మైదానాలు కరువు



జెడ్పీహెచ్ఎస్‌లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కోడేరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వం భూముల్లో అనువైన స్థలాన్ని గుర్తించి క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాని మండలంలో మొత్తం 22 గ్రామ పంచాయతీలు ఉండగా ఏ గ్రామంలో కూడా అధికారులు క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ గుర్తించడం లేదు. క్రీడలపై ఆసక్తి ఉన్నా క్రీడాకారుల ప్రతిభను గుర్తించేవారే కరువయ్యారు. కనీసం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా క్రీడామైదాన వసతులపై దృష్టి సారించకపోవడంతో విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపడం లేదు. విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించాలనే ఆలోచన రాకపోవడం అందుకు సరైన నిధులు కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 40 పాఠశాలలకు గానూ 3800 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి పాఠశాలలో మైదానం లేకపోయిన క్రీడా మైదానాలను ఉన్నట్లు రికార్డుల్లో మాత్రం చూపించారే తప్పా వాస్తవానికి ఎక్కడ కూడా క్రీడా మైదనాలు ఏర్పాటు చేయలేదని విమర్శలు వినిపిస్తున్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలలో రాణిస్తున్నా మైదానాలు లేకపోవడంతో వారి ఆశయాలు నీరుగారిపోతున్నాయి.

తూతూమంత్రంగా పైకా పోటీలు

ప్రతి ఏటా నిర్వహించే పైకా క్రీడలు తూతూ మంత్రంగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడల నిర్వహణ, మైదానాలు ఏర్పాటు కు ప్రత్యేక నిధులు కేటాయించాలని మండలంలోని తల్లి దండ్రులు ఉపాధ్యాయులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలను బయటకు తీసేలా మైదానాలను ఏర్పాటు చేసి విద్యార్థులు క్రీడా రంగంలో రాణించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రీడా మైదానాలు లేవు..



క్రీడల్లో ఆసక్తి ఉన్నా సరైన మైదానాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. దీంతో ఆడేందుకు అవకాశం లేకుండా పోతోంది. క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తే జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి రోజు ప్రాక్టీస్ చేస్తే క్రీడల్లో ప్రావీణ్యం మెరగవుతోంది. అధికారులు వెంటనే క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

– లోకేష్, కోడేరు, హైస్కూల్

క్రీడలకు సమయం కేటాయించాలి..



చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రత్యేక సమయం కేటాయిస్తే క్రీడాకారుల సత్తా గుర్తించవచ్చు. క్రీడా మైదానాలు లేకపోవడంతో ఆటలలో వెనకబాటుకు గురవుతున్నాం. ప్రభుత్వ స్థలాలు ఉన్నా క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదు. ప్రతిభగ క్రీడాకారులు ఉన్నా ఉపయోగం లేకుండా పోతోంది. అధికారుల స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పల్లవి, కోడేరు, హైస్కూల్

మైదానాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి..



క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ప్రతి పాఠశాలలో క్రీడా ప్రాంగాణాలు గుర్తిస్తే విద్యుర్థులకు మేలు జరుగుతుంది. ప్రతిరోజు ప్రాక్టిస్ చేసేందుకు అవకాశం కల్పించాలి. చాలా మంది విద్యార్థుల ప్రతిభను గుర్తించేలేకపోతున్నాం. నిధులు కేటాయించి మైదానాలు ఏర్పాటు చేయాలి.

– కష్టయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం, కోడేరు

అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం



అచ్చంపేట ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద ఎడ్లబండ్ల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: అర్హులందరికీ రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ఎ మినీ స్టేడియం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల్లో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలకు పాలాభిషేకం చేశారు. అనంతరం లింగాల రోడ్డులోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2004లో దివంగత ముఖ్యమంత్రి డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రుణమాఫీ చేశారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తునట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో తొలి విడత 1,91,519 కుటుంబాల్లోని 2,01,102 మంది రైతులకు రూ.1,120,74 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. జిల్లాలో 47,750 మంది రైతులకు రూ.270.04కోట్ల నిధులను బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడిపాల గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కౌన్సిలర్ గౌరిశంకర్, మాజీ ఎంపీపీ రామనాథం, జి.రాజేందర్, బీరం మాధవరెడ్డి, సూరం రమేష్‌రెడ్డి, కాశన్నయాదవ్, అంతటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు, కాంసానిపల్లి, కొరటికల్ తదితర గ్రామాల్లో సీఎం రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేశారు. నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, నాయకులు దండు నర్సింహ, వంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, చంద్రయ్య, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి, సత్యం, శంకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడం సంతోషకరమని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితవాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

క్లుప్తంగా

రేపు గురుపౌర్ణమి మహోత్సవం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో 21వ తేదీ గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తునట్లు ఆలయ అర్చకులు శివయ్యశర్మ, ప్రవీణ్‌కుమార్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు బాబావారి సుప్రభాత సేవ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గణపతి పూజ, క్షీరాభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం, సత్యనారాయణస్వామి, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు వివరించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి వినతి



నాగర్‌కర్నూల్: పాలమూరు, తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటిన బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టాలని కోరుతూ వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షుడు దినకర్ శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. దశాబ్దాల కాలంగా ఎంతో మంది కవులు, తెలంగాణ వాదులు ఆకాంక్షిస్తున్నారని వివరించారు.

విగ్రహావిష్కరణకు ఆహ్వానం

కల్వకుర్తిరూరల్: మండలంలోని పోల్కంపల్లిలో ఆవిష్కరించనున్న చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణకు రావాలని మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిలకు విగ్రహ కమిటీ నాయకులు సురేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆదివారం విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గణేష్, కాశీనాథమ్, శ్రీనివాసులు, పరమేష్ తదితరులు ఉన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్యకు నివాళి


నాగర్‌కర్నూల్‌రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్నా ఆ సంఘం నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఫోరం రాష్ట్ర నాయకులు జెట్టి ధర్మరాజు, గుర్రం శ్రీనివాసులు, పిడికిల్ల శ్రీనివాసులు, సదుర్ల తిరుపతయ్య, మూలింటి వెంకటేశ్వర్‌లు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.30 వేలు సమకూర్చారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధితుడికి నగదు అందజేశారు. నిజాముద్దీన్, గంగయ్యగౌడ్, జలాల్, శేషిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అనీల్, పాండు, రవి, శ్రీశైలం, గౌస్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన



చారకొండ: అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చంద్రాయన్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించాలని చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భాగ్యమ్మ, అక్షర, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష

కల్వకుర్తిరూరల్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురికి జైలు శిక్ష ఖరారు అయినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో మద్యం తాగి వాహనం నడిపిన నలుగురికి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. వారికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కావ్య తీర్పు ఇచ్చారని వివరించారు.

యాగ, హోమాలతో ప్రశాంతత



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, సరిత దంపతులు

నాగర్‌కర్నూల్: యాగ, హోమాలతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చండీ హోమంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించేందుకు చేపట్టిన అయుత చండీయాగం దిగ్విజయంగా పూర్తి చేసుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. హోమ యోగాల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో పాటు అన్ని రకాల దోషాలు తొలగిపోతాయన్నారు. ఈ నెల 7 నుండి 15 రోజులపాటు పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో బస్సు, బైక్ ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పదర మండలంలోని పెట్రాల్ చేన్ గ్రామానికి చెందిన విఘ్నేష్, ఆనంద్, సామ్యేల్ అనే ముగ్గురు చెంచు యువకులు బైక్‌పై అచ్చంపేటకు వెళ్తున్నారు. అదే సమయంలో అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శ్రీశైలానికి వెళ్తోంది. మార్గమధ్యలో నిరంజన్‌షావలీ దర్గా సమీపంలో కుంచేనిమూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ఆర్టీసీ డ్రైవర్ ఊషన్న చాకచక్యంగా వ్యవహరించి సడన్ బ్రేక్ వేయడంతో పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారు. గాయపడిన వారిని మన్ననూర్‌లోని ఆర్టీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయ పరిస్థితి ఏమి లేదని వైద్యాధికారి సైపుల్లాఖాన్ తెలిపారు.

గోరింటాకు ఉత్సవం

అచ్చంపేట రూరల్: ఆశాఢమాసం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో అంజనీమాత సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. చేతులకు చక్కగా అలంకరించుకొని ప్రదర్శించారు. గోరింటాకు విశిష్టతకు పలువురు మహిళలకు వివరించారు. మహిళలు సునీతాబాయి, శకుంతల, హేమలత, మంగమ్మ, చంద్రకళ, నారాయణమ్మ, కవిత పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

తెలకపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి చంద్రకళ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలం నుంచి చలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గోపస్ లక్ష్మన్, అలివేలమ్మ, తిరుపతమ్మ, లక్ష్మి, జహీరబేగం, లక్ష్మీకాంతమ్మ, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేవు

కల్వకుర్తిరూరల్: విద్యుత్ సబ్ డివిజన్‌లో ఎలాంటి అధికారిక విద్యుత్ కోతలు లేవని విద్యుత్ సబ్ డివిజన్ అధికారి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఊర్కొండ మండలంలోని జెకినాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ తీగలు అర్ధరాత్రి తెగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని మరుసటి రోజు ఉదయమే మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో తప్పుడు ప్రచారం చేయొద్దని వివరించారు.

ఒకే ఈతలో రెండు దూడలు

తాడూరు: మండల కేంద్రంలో శుక్రవారం రైతు పల్లమోని శివకు సంబంధించిన గేదె రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒకే ఈతలో రెండు దూడలు పుట్టడం అరుదు అని పశువైద్యాధికారులు తెలిపారు.

గొడవకు దారి తీసిన మూఢనమ్మకాలు

లింగాల: ఇటీవల మల్లోనిచెర్వుతండా వాసులు జ్వరాలు, ఇతర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. తండాలోని ప్రతి ఇంటిలో అస్వస్థకు గురవుతున్నారు. దీంతో తండా వాసులు ఇటీవల ఓ మంత్రగాడి సంప్రదించగా నాలుగేళ్ల కిందట గ్రామ దేవత బొడ్రాయిని ఏర్పాటు చేసిన తర్వాత తిరిగి పూజలు చేయంచక పోవడంతో ఇలా జరుగుతుందోదని పేర్కొన్నాడు. తండా బాగుండాలంటే తండా నలుదిక్కుల మంత్రించిన నిమ్మకాయలను ఉంచాలని చెప్పాడు. గ్రామస్తులు నిమ్మకాయలను తీసుకొచ్చి నలుదిక్కుల ఉంచారు. మంత్రించిన నిమ్మకాయలను తమ పొలంలో పెట్టారని తండాలోని ఓ యాదవ కుటుంబం తండావాసులపై బూత్‌పురాణం మొదలుపెట్టారు. దీంతో గ్రామస్తులు యాదవకుటుంబంపై గొడవకు దిగారు. మాటమాట పెరగడంతో చివరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

అవగాహన

ఆధునిక యుగంలో మూఢనమ్మకాలను నమ్మి గొడవలకు దిగొద్దని ఎస్ఐ జగన్‌మోహన్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని మల్లోనిచెర్వుతండాలో కమ్యూనిటీ పోలీసులో భాగంగా ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మంత్రతంత్రాలను నమ్మి మోసపోద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ శ్రీనివాసులు, కానిస్టేబుల్ బాలరాజు, హోంగార్డు శంకర్, తండా వాసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత

కొల్లాపూర్: కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పట్టణంలోని ఆర్ఐడీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెండు మండలాల్లో ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన 30 మంది విద్యార్థులకు రూ.1116 తో పాటు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి, వారి తల్లిదండ్రులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాంగి కృష్ణప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల విజయ్, సంగమేశ్వర్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రంజిత్, సోమిశెట్టి రాంప్రసాద్, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రికి వినతి



పెంట్లవెల్లి: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా నాయకుడు ఈశ్వర్ శుక్రవారం కొల్లాపూర్‌లో ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో 16 సంవత్సరాల కిందట పేదల ఇండ్ల స్థలాల కోసం 14 ఎకరాల 36 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం సేకరించింది. అదేవిధంగా జటప్రోల్‌లో 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూములను పేదల ఇళ్ల నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని పలు గ్రామాల రైతులకు చివరి ఆయకట్టుకు నీరు రాక ఇబ్బందులు పడుతున్నారని సింగోటం, గోపల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి రైతులకు సాగునీరు అందించాలని మంత్రిని కోరారు.

లైన్‌మన్ ఏఈకి ఫిర్యాదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌మేన్‌గా పని చేస్తున్న శీనునాయక్‌పై శుక్రవారం సబ్‌స్టేషన్ వద్ద ఏఈ అమర్‌సింగ్‌కు రైతులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న లైన్‌మన్‌ను రైతులు సబ్‌స్టేషన్ నుంచి ఘెరావ్ చేశారు. రైతులను ఏఈ నచ్చజెప్పి సముదాయించారు. ఫిర్యాదును ఉన్నతాధికారులకు అందజేస్తానని హామీ ఇచ్చారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

అచ్చంపేట రూరల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని సిద్దాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాలకు అధిక నిధులు కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిక్కుమాండ్ల మనోహర్, రాఘవులు, మోపతయ్య, రాజేష్, బుచ్చిరాములు, పీఆర్ ఏఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు అందుబాటులో ఉంచాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని నర్సరీలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల మొక్కలను అందుబాటులో ఉంచాలని ఈజీఎస్ఏపీఓ చంద్రసిద్దార్థ కోరారు. శుక్రవారం మండలంలోని మేడిపూర్, పాల్మూరు గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటాలన్నారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



అమ్రాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జక్కరామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పదర, అమ్రాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలను తిరిగి డీటీఎఫ్ సభ్య నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్రాబాద్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రమోషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డీటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, కార్యదర్శులు ఎల్లయ్య, పాండయ్య, తిరుపతయ్య, మండల కార్యదర్శి విజయ్ తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన



బిజినేపల్లి : విద్యుత్ సరఫరాలో నిరంతరం అంతరాయం ఏర్పడుతోందని సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండు చేస్తూ తిమ్మాజిపేట మండలంలోని చేగుంట గ్రామస్తులు గోరిట గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో చలో హైదరాబాద్, కమిషనరేట్ కార్యాలయ ముట్టడిస్తామని వివరించారు. సైదమ్మ, శివలీల, మణెమ్మ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



తాడూరు: ఎన్నికల ముందు దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ కోరారు. శుక్రవారం మండలంలోని అంతారంలో నిర్వహించిన దళిత హక్కుల పోరాట సమితి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రభుత్వం దళితులు, బడుగు వర్గాలు ఇతర ప్రజానీకానికి వచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు రూ.2500, పింఛన్ల పెంపు వంటి వాటిని అమలు చేయడంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువకులకు రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటును అందించాలన్నారు. వెంకటయ్య, మశన్న, బంగారయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

వెల్దండ: మండల కేంద్రంలోని ఏవీఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఐక్యత ఫౌండేషన్, శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డిలు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 27 వరకు శిబిరం కొనసాగుతోందన్నారు. శంకరనేత్రాలయ చెన్నై వైద్యులు అరుణ్‌కుమార్, రాజు, నాయకులు శ్రీరాములు, వెంకటరెడ్డి, నరేందర్‌గౌడ్, ఫౌండేషన్ సభ్యులు మల్లయ్య, రమేష్‌నాయక్, కొండల్ యాదవ్, అభినవ్‌రెడ్డి, యుసూఫ్‌బాబా, శ్రీపతి శేఖర్, తిరుపతి, పుల్లారెడ్డి, కొండల్‌రెడ్డి, మల్లేష్, హస్సన్, విజయ్ శ్రీను, శివ, రాహుల్, మహేష్, కళ్యాణ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే గౌడ కులస్తుల అభ్యున్నతి



కొల్లాపూర్: కాంగ్రెస్‌తోనే గౌడ కులస్తుల అభ్యున్నతి సాధ్యమని గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు వంగ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఎల్ఐ అతిథిగృహంలో గౌడ సంఘం నాయకులు సమావేశం అయ్యారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజశేఖర్‌గౌడ్ మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని వివరించారు. ఈనెల 22న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహ ప్రారంభోత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో వెంకటస్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోవింద్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, రామకృష్ణగౌడ్, మధుసూదన్‌గౌడ్, శివన్నగౌడ్, యాదగిరిగౌడ్,భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.

అంజన్నను దర్శించుకున్న డీఈ

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండ పేట పబ్బతి ఆంజనేయస్వామిని శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా విద్యుత్ డీఈ, కల్వకుర్తి విద్యుత్ ఏడీ చంద్రశేఖర్ లు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు విద్యుత్ అధికారులను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రమణి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఊర్కొండ: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం.. ఈ నెల 11న మూసాపేట మండలం జానంపేట గ్రామానికి చెందిన కుమ్మరి సురేష్ (33) కల్వకుర్తికి సొంత పనుల నిమిత్తం ఆటోలో బయలు దేరాడు. కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారిపై ఊర్కొండపేట శివారులోని కాటన్ మిల్లు వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. స్థానికులు వెంటనే సురేష్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. సురేష్ మామ వడ్ల చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించారు.